GHMC hmda Growing Global TS-bPASS
MAKAM GANGADHAR NETHA
President (GHMC)
Telangana Building Planners Association
E-mail ID : sriswamiplanners@gmail.com
వాస్తుకి బిల్డింగ్ ప్లానింగ్, నక్ష చేయబడును
డిజిటల్ లాండ్స్ సర్వే, లే-అవుట్లు,
నక్ష ప్లానింగ్ చేయబడును,
Auto DCR Online Up Loading, Pre DCR Cad Drawing
భవన నిర్మాణ దరఖాస్తు కొరకు సంప్రదించండి.
SRI SWAMI ASSOCIATES
ARCHITECTS • ENGINEERS • SURVEYORS
We Undertake Building Plans, Lay-Out Plans & Permissions, LRS, BRS, Tax Assesments
GHMC, HMDA, DTCP, TS-bpass - Layout`s, Building Permissions
H.No. 11-5-565, Bhagya Laxmi Towers, Opp: GHMC Circle Office, Saroornagar, Hyderabad - 500035
Mob : 9393929595

క్రైమ్ THE మిర్రర్®
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
గురువారం 03-09-2026 | పబ్లిషింగ్ సెంటర్ : హైదరాబాద్

# మునుగోడులో 1000 రోజుల పాలనపై హోరెత్తిన బిఆర్ఎస్ నిరసన ధర్నా

- మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డి తీవ్ర ధ్వజం
- 1000 రోజుల కాంగ్రెస్ పాలనపై మండిపాటు
- 420 హామీలతో కూడిన 420 మీటర్ల ఫ్లెక్సీ ప్రదర్శన
- 1000 రోజుల పాలనలో కాంగ్రెస్ రంగు బయటపడింది
- ఇంటిఇంటికి బాకీ కార్డులు

8లో




**టమునుగోడు ( క్రైమ్ మిర్రర్ ) సెప్టెంబర్ 02 :** కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చి నెరవేర్చని 420 హామీలకు నిరసనగా బిఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ పిలుపుమేరకు మునుగోడు నియోజకవర్గ కేంద్రంలో బిఆర్ ఎస్ శ్రేణులు బారీ ఎత్తున నిరసన ధర్నా,ఆందోళన కార్యక్రమం నిర్వహించారు.1000 రోజుల కాంగ్రెస్ పాలన కేవలం మోసపూరితంగానే సాగిందని, ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని నాయకులు మండిపడ్డారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, బిఆర్ ఎస్ రాష్ట్ర నాయకురాలు పాల్వాయి స్రవంతి రెడ్డి నాయకులతో కలిసి బారీ ర్యాలీగా ధర్నా చౌక్‌కు చేరుకున్నారు. అనంతరం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 420 హామీలతో రూపొందించిన 420 అడుగుల బారీ ఫ్లెక్సీని చౌరస్తాలో ప్రదర్శించి, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు. మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేందుకు ప్రజలకు నెరవేర్చలేని 420 మోసపూరిత హామీలిచ్చి, నేడు పాలనలో ఘోరంగా విఫలమైంది. రైతులకు ఇచ్చిన రూ. 2 లక్షల రుణమాఫీ, ఎకరానికి రూ. 15,000 రైతుబంధు, మహిళలకు మహాలక్ష్మి పథకం కింద రూ. 2,500 వంటి ఏ ఒక్క హామీని పూర్తిగా అమలు చేయలేదు. ప్రజలను మభ్యపెట్టి ఓట్లు దండుకున్న కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదనీ ద్వజమెత్తారు..కేసిఆర్ గారి నాయకత్వంలో తెలంగాణ సంక్షేమ పథకాలతో వర్ధిల్లితే, నేడు కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందన్నారు.ప్రజల పక్షాన బిఆర్ఎస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని,ఈ 7 రోజుల నిరసనల ద్వారా కాంగ్రెస్ వైఫల్యాలను గడపగడపకూ తీసుకెళ్తాం అన్నారు. రాష్ట్ర నాయకురాలు పాల్వాయి స్రవంతి రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైంది.

మిగతా 8లో

## నకిలీ డాక్టర్ల ముఠా గుట్టురట్టు

### పది మంది అరెస్ట్.. పది క్లినిక్‌లు సీజ్

కుత్బుల్లాపూర్: వైద్య విద్యార్హతలు లేకుండా క్లినిక్‌లు నిర్వహిస్తున్న 10 మంది నకిలీ డాక్టర్లను సైబరాబాద్ స్పెషల్ ఆపరేషన్ టీమ్, పేట్ బషీరాబాద్ పోలీసులు, వైద్య ఆరోగ్య శాఖా అధికారులు సంయుక్తంగా నిర్వహించిన దాడుల్లో అరెస్ట్ చేశారు. వివరాలను మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి వెల్లడించారు. నిందితులు గుర్తింపు పొందిన వైద్య డిగ్రీలు లేకుండానే సాధారణ వైద్యంతో పాటు చిన్నపిల్లలకు కూడా వైద్యం అందిస్తున్నారని చెప్పారు. కొన్ని క్లినిక్‌లలో బెడ్‌లు ఏర్పాటు చేసి రోగులను అడ్మిట్ చేసుకోవడం, అనుభవం లేకుండా స్లైన్లు ఎక్కించడం వంటి ప్రమాదకరమైన చర్యలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. వీరిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి క్లినిక్ పరికరాలను స్వాధీనం చేసుకొని బుచ్చయ్య, సుధాకర్ చారి, అంజగౌడ్, రామావత్ ప్రకాశ్, మేకల అక్షయ్‌కుమార్, కె.నారాయణ, జి.ప్రహ్లాద్, బుచ్చిబాబు, ఎస్.శ్రీనివాసరావు, పి.గంగారామ్‌లపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

## విద్యార్థుల చదువుకు బస్సుల కష్టాలు



4లో

# గంజాయి బారిన పడొద్దు.. జీవితాలను నాశనం చేసుకోవద్దు

**గంజాయి రహిత సమాజమే లక్ష్యం: ఏసీపీ వెంకటేశ్వర్**

**10 మంది యువకుల గుర్తింపు.. డి-అడిక్షన్ సెంటర్‌కు తరలింపు**




**మంచిర్యాల సెప్టెంబర్ 2 (క్రైమ్ మిర్రర్) :** గంజాయి సేవించి యువత తమ భవిష్యత్తును, జీవితాలను నాశనం చేసుకోవద్దని జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్ సూచించారు. మంచిర్యాల జిల్లా భీమవరం మండల పరిధిలో గంజాయి రహిత వాతావరణాన్ని సృష్టించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. బుధవారం సీఐ, భీమవరం ఎస్ఐ తమ పోలీసు బృందంతో కలిసి మండలంలో క్రమంగా గంజాయి తాగుతున్న 10 మంది యువకులను అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు.అదుపులోకి తీసుకున్న యువకులను గత మూడు నెలల క్రితం కూడా గుర్తించి కౌన్సిలింగ్ ఇచ్చామని, అయినప్పటికీ వారిలో మార్పు రాకపోవడంతో మళ్లీ పరీక్షలు నిర్వహించామని ఏసీపీ తెలిపారు. గంజాయి వ్యసనానికి గురైన వారిని మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలోని 'డి-అడిక్షన్ సెంటర్'కు తరలించి, వైద్యుల సంరక్షణలో ఈ అలవాటును మానిపించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.యువత గంజాయికి అలవాటుపడి చదువులు వదిలేసి నేరాల బాట పడుతున్నారని, రహదారి ప్రమాదాలకు గురై ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారని ఏసీపీ ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల భీమవరంలో జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడికి పరీక్ష చేయగా.. అతడు గంజాయి తాగి వాహనం నడిపినట్లు తేలిందని వివరించారు.

**తల్లిదండ్రుల నిఘా అవసరం**

తల్లిదండ్రులు తమ పిల్లల నడవడికపై నిరంతరం నిఘా ఉంచాలని, వారి ప్రవర్తనలో ఏమైనా మార్పు కనిపించి అనుమానం వస్తే వెంటనే స్థానిక ఎస్ఐ,సీఐకి సమాచారం అందించాలని కోరారు. పరిసర ప్రాంతాల్లో ఎవరైనా గంజాయి సేవించినా, విక్రయించినా, పోలీసులకు తెలపాలని విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో జైపూర్ సీఐ.నవీన్ కుమార్, భీమారం ఎస్సై ఏ.రాజేందర్ పాల్గొన్నారు

# బాలాపూర్ లో వైఎస్ఆర్ కు ఘన నివాళులు




బాలాపూర్ (క్రైమ్ మిర్రర్) జిహెచ్ఎంసి పరిధిలోని బాలాపూర్ డివిజన్ లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి హాజరై, వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో మాట్లాడుతూ వైఎస్ రాజశేఖర్ రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు నిరుపేదల జీవితాల్లో నిరంతరం వెలుగులు నింపుతున్నాయని, ఆయన ప్రజా సంక్షేమ పాలనతో ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ వంగేటి ప్రభాకర్ రెడ్డి, ఎర్ర జైహింద్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పన్నాల రాజేందర్ రెడ్డి, బలింగని జంగయ్య, డివిజన్ అధ్యక్షులు నీరుడు శ్రీరాములు బాలాపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల ప్రతినిధులు మరియు అభిమానులు పాల్గొన్నారు.




## వైయస్సార్ కు ఘన నివాళులు

**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్) :** జిహెచ్ఎంసి 61వ డివిజన్ బడంగ్పేట్ లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైయస్సార్ 17వ వర్ధంతి కార్యక్రమం బడంగ్పేట్ డివిజన్ అధ్యక్షులు బంగారి అశోక్ ఆధ్వర్యంలో స్థానిక నాయకత్వంతో వైయస్సార్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మాజీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే ఎలిమేటి అమరేందర్ రెడ్డి, నాదర్గుల్ డివిజన్ అధ్యక్షులు గోవర్ధన్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు పెద్ద బావి సుదర్శన్ రెడ్డి, రాళ్ల గూడెం శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ నాయకులు పెద్ద బావి సమరసింహా రెడ్డి, గట్టు బాలకృష్ణ, విజయ్, నయనా చారి, మహిళా నాయకురాలు అరుణ్ జ్యోతి, లక్ష్మి శెట్టి మనోహర్, శివ, భార్గవ్, సాయికుమార్, రామిడి దిలీప్ రెడ్డి, వంశీ, సంతోష్, మరియు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# మాదాపూర్ లో గుర్తు తెలియని వ్యక్తి మృతి....



**క్రైమ్ మిర్రర్ మాదాపూర్ :** విద్యుత్ షాకుకు గురై వ్యక్తి మరణించిన ఘటన మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సిద్దిక్‌నగర్ రోడ్ నంబర్-10 లోని ప్రభుత్వ పార్క్ వెనుక ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద బుధవారం మధ్యాహ్నం సుమారు 2 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. మృతుడి వయస్సు సుమారు 25 నుంచి 30 సంవత్సరాలు ఉంటుందని పోలీసులు తెలిపారు. అతను బ్రౌన్ రంగు షర్టు, గ్రీన్ రంగు జీన్స్ ప్యాంటు ధరించి ఉన్నట్లు పేర్కొన్నారు. మృతుడిని ఎవరైనా గుర్తించినట్లయితే మాదాపూర్ పోలీస్ 8712663109 స్టేషన్ కు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.



## బాల్నే ప్రకాష్ బాబుకు ఘనంగా వీడ్కోలు..!!

**- ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణపై విద్యాసదస్సు**

**- విద్యారంగం పెను సంక్షోభంలో ఉంది : ప్రొఫెసర్ లక్ష్మినారాయణ**

**- ప్రభుత్వ పాఠశాలలే భవిష్యత్ చైతన్య కేంద్రాలు : సంపాదకులు గంగాధర్**

**క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి:** మహాదేవపూర్ మాజీ మండల విద్యాధికారి, ఉర్దూ మీడియం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాల్నే ప్రకాష్ బాబు పదవీవిరమణ సందర్భంగా డీటీఎఫ్ మహాదేవపూర్ మండల శాఖ ఆధ్వర్యంలో విద్యాసదస్సు నిర్వహించారు. సదస్సులో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్, విద్యా పరిరక్షణ సమితి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ లక్ష్మినారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగం సంక్షోభంలో ఉందని, విద్యను కాపాడేందుకు దేశవ్యాప్తంగా ఉద్యమాలను తీవ్రతరం చేయాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాష్ రెడ్డి ప్రభుత్వ ఉపాధ్యాయుల సేవలను, డీటీఎఫ్ మండల శాఖను అభినందించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. లింగారెడ్డి మాట్లాడుతూ ఉద్యమాలతోనే సమస్యల పరిష్కారం సాధ్యమవుతుందని, సెప్టెంబర్ 10న హైదరాబాద్‌లో మహాధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం ప్రకాష్ బాబును పలువురు నాయకులు, ఉపాధ్యాయులు శాలువాలతో సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు అశోక్, ప్రధాన కార్యదర్శి తిరుపతి, రాష్ట్ర కౌన్సిలర్లు, జిల్లా నాయకులు చల్ల మొండయ్య, డీటీఎఫ్ జనరల్ సెక్రటరీ దామరకుంట శ్రీకాంత్, మరియూ పలుగురు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, వివిధ మండలాల డీటీఎఫ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## నేత్రదానం సామాజిక బాధ్యత: డా. నరేందర్ రాథోడ్

**మంచిర్యాల, సెప్టెంబర్ 2 (క్రైమ్ మిర్రర్) :** నేత్రదానం పక్షోత్సవాల్లో భాగంగా మంచిర్యాల పట్టణంలోని మహాత్మా జ్యోతిబా పూలే బాలికల గురుకుల పాఠశాలలో నేత్రదానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. డీఎంహెచ్ఓ డాక్టర్ నరేందర్ రాథోడ్, గురుకులాల కోఆర్డినేటర్ అశోక్‌తో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ డా. నరేందర్ రాథోడ్ మాట్లాడుతూ.. నేత్రదానం సామాజిక బాధ్యత అని, ప్రతి ఒక్కరూ దీనిపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. మూడు నెలల క్రితం ఆర్బీఎస్కే, జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో పాఠశాలల్లో నిర్వహించిన కంటి పరీక్షల ఆధారంగా జిల్లాకు 850 కంటి అద్దాలు మంజూరయ్యాయని తెలిపారు. ఇందులో భాగంగా చూపు లోపాలతో బాధపడుతున్న 35 మంది విద్యార్థినులకు ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేసినట్లు వెల్లడించారు.విద్యార్థులు ఆకుకూరలు, పండ్లు, ప్రొటీన్లతో కూడిన పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. గంటల తరబడి సెల్‌ఫోన్లు, డిజిటల్ తెరలను చూడకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల నివారణకు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని, కాచి వడబోసిన నీటినే తాగాలని సూచించారు.అనంతరం అధికారులు పాఠశాల వంటగది, పరిసరాలను పరిశీలించారు. కూరగాయలను శుభ్రంగా కడిగిన తర్వాతే వంట చేయాలని, వంటగదిలో పరిశుభ్రత పాటించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్బీఎస్కే వైద్యాధికారులు, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు, సీహెచ్ఓలు నాందేవ్, కాకిరాల వెంకటేశ్వర్లు, హెల్త్ ఎడ్యుకేటర్ అల్లాడి శ్రీనివాస్, జిల్లా అంధత్వ నివారణ కోఆర్డినేటర్ శంకర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



## రజక ఫెడరేషన్ చైర్మన్ దాసరిరాజు అజయ్ కుమార్‌ని కలిసి మెమోరండం అందజేసిన టిఆర్ఆర్ఎస్ రాష్ట్ర నాయకులు

తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి

నూతన కనెక్షన్ ల కోసం ఆన్లైన్ వెబ్సైట్ త్వరలో ఓపెన్ : చైర్మన్

బిల్లుల బకాయిలపై ఆందోళన చెందవద్దు : చైర్మన్

రజక సంక్షేమం కోసం కృషి చేస్తా: చైర్మన్

హైదరాబాద్,క్రైమ్ మిర్రర్:- తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చెందుతున్న రజక వృత్తిదారుల కోసం ఈరోజు రజక ఫెడరేషన్ చైర్మన్ దాసరిరాజు అజయ్ కుమార్ ని తన కార్యాలయంలో కలిసి 250 యూనిట్ల ఉచిత విద్యుత్ బిల్లుల బకాయిలు చెల్లించాలని కోరుతూ మెమోరండం అందజేసిన తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర అధ్యక్షులు గోపి రజక, రాష్ట్ర కో కన్వీనర్ పాతనబోయిన సంతోష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వైనాల లింగన్న, రాష్ట్ర నాయకులు వేములవాడ రాజేష్,రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు బాచుపూర్ వెంకటయ్య, హైదరాబాద్ జిల్లా యూత్ అధ్యక్షులు సిహెచ్ బాలకృష్ణ. చైర్మన్ డాక్టర్ దాసరిరాజు అజయ్ కుమార్ స్పందిస్తూ రజక వృత్తిదారులు ఆందోళన చెందవద్దని విద్యుత్ అధికారులు ఎలాంటి ఇబ్బందులకు గురిచేసిన మా దృష్టికి తీసుకురావాలని హామీ ఇచ్చారు. ఎంత బిల్లు వచ్చిన ప్రభుత్వమే చెల్లిస్తుందని దీనిపై ఎలాంటి అపోహలు వద్దని వారన్నారు. గతంలో కనెక్షన్ తీసుకోని రజక వృత్తిదారుకు ఆన్లైన్ వెబ్సైట్ ద్వారా దరఖాస్తులు తీసుకుని కనెక్షన్ లు ఇచ్చే ఏర్పాటు చేస్తామని అంతేకాకుండా రజక సంక్షేమం కోసం తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. చైర్మన్ కి ధన్యవాదాలు శుభాకాంక్షలు తెలుపుతూ శాలువాతో సన్మానించడం జరిగింది.

## ఘనంగా మాజీ ఎంబీసీ చైర్మన్ నంది కంటి శ్రీధర్ జన్మదిన వేడుకలు

క్రైమ్ మిర్రర్, మల్కాజిగిరి : మాజీ ఎంబిసి చైర్మన్ నందికంటి శ్రీధర్ పుట్టినరోజు వేడుకలు బుధవారం నాడు వినాయక నగర్ చౌరస్తాలో బారాస నాయకులు గుత్తి రామచందర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి మల్కాజ్గిరి నియోజకవర్గం ఇంచార్జ్ బద్దం పరుశురామిరెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి కేకు కట్ చేశారు. ఈ సందర్భంగా పరశురామ్ రెడ్డి మాట్లాడుతూ రాబోయేది టిఆర్ఎస్ ప్రభుత్వమేనని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఏ ఒక్క హామీ నెరవేర్చ లేదని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు చంద్రమౌళి, అంజయ్య,ఎం ఆర్ శ్రీనివాస్ యాదవ్, కృష్ణమూర్తి గౌడ్, ఫరీద్ , శేఖర్ గౌడ్, సాయి ముదిరాజ్, పేపర్ శీను, ఉమేష్, రంజిత్, సాయిరాం, వెంకటేష్ చారి, సాయి, స్వామి, లక్ష్మి, అరుంధతి, సత్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



# గురువు వెలిగిస్తేనే... భావితరం బాట సుగమం



- విద్యకు దిక్సూచి గురువు... సమాజానికి మార్గదర్శి
- గురువు గౌరవం కాపాడితేనే విద్యకు విలువ
- గురువు వెలిగిస్తేనే... భావితరం బాట సుగమం
- ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక ఎడిటోరియల్

క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి: విద్య అంటే కేవలం అక్షర జ్ఞానం కాదు. మనిషిని సంస్కారవంతుడిగా, బాధ్యతాయుతమైన పౌరుడిగా, సంపూర్ణ వ్యక్తిత్వం కలిగినవాడిగా తీర్చిదిద్దే ప్రక్రియ. ఆ విద్యకు దిశానిర్దేశం చేసే మహోన్నత వ్యక్తి గురువు. 'విద్య' అనే పదం సంస్కృతంలోని 'విద్' అనే ధాతువు నుంచి వచ్చింది. దాని అర్థం తెలుసుకోవడం, జ్ఞానాన్ని పొందడం. జీవితాన్ని అర్థవంతంగా తీర్చిదిద్దుకోవడానికి అవసరమైన జ్ఞానం, సంస్కారం, వివేకం కలగడమే విద్య యొక్క అసలు లక్ష్యం. గురుకులాల్లో విద్యార్థులకు విద్యతో పాటు క్రమశిక్షణ, సేవాభావం, సత్‌ప్రవర్తన, నైతిక విలువలు, ఆధ్యాత్మిక చింతన, సామాజిక బాధ్యతలను కూడా బోధించేవారు. అందుకే అప్పటి గురుశిష్య సంబంధం ఎంతో ఆత్మీయంగా ఉండేది. "విద్యా వినయేన శోభతే" --- విద్యకు వినయం తోడైతేనే దానికి సార్థకత. విద్య వల్ల అహంకారం పెరగకూడదు; బాధ్యత పెరగాలి. జ్ఞానం పెరిగే కొద్దీ మనిషిలో మానవత్వం కూడా పెరగాలి. విద్య యొక్క లక్ష్యం గురించి మహనీయులు ఎన్నో విలువైన అభిప్రాయాలు వ్యక్తం చేశారు. స్వామి వివేకానంద దృష్టిలో విద్య అనేది మనిషిలో అంతర్లీనంగా ఉన్న సంపూర్ణతను వెలికి తీయాలి. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ అభిప్రాయం ప్రకారం, ఆలోచించగలిగే మేధస్సును, బాధ్యతాయుతమైన వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దడమే విద్య యొక్క ప్రధాన ఉద్దేశం. సోక్రటీస్ చెప్పిన "నిన్ను నీవు తెలుసుకో" అనే సందేశం కూడా విద్య యొక్క అంతరార్థాన్ని తెలియజేస్తుంది.

### గురువు... ఒక శిల్పి...

విద్యార్థి ఒక ముడి శిల అయితే, గురువు ఒక శిల్పి. శిల్పి ఉలి దెబ్బలతో రాయికి అందమైన రూపం ఇచ్చినట్లే, గురువు తన జ్ఞానం, అనుభవం, క్రమశిక్షణ, ప్రేమ, మందలింపు, ప్రోత్సాహంతో విద్యార్థి వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుతాడు. ప్రతి విద్యార్థి ఒకే విధంగా ఉండడు. ఒకరికి సలహా అవసరం కావచ్చు. మరొకరికి ప్రోత్సాహం అవసరం కావచ్చు. ఇంకొకరికి క్రమశిక్షణ అవసరం కావచ్చు. విద్యార్థి అవసరాన్ని గుర్తించి, అతని సామర్థ్యాన్ని వెలికి తీయగలిగినవాడే నిజమైన గురువు. తన వద్ద చదువుకున్న విద్యార్థి తనకంటే గొప్ప వ్యక్తిగా ఎదగాలని కోరుకునేవాడే గురువు. ప్రపంచంలో గొప్ప స్థానాల్లో ఉన్న శాస్త్రవేత్తలు, వైద్యులు, న్యాయవాదులు, అధికారులు, రాజకీయ నాయకులు, కళాకారులు, సాంకేతిక నిపుణులు, వివిధ రంగాల ప్రముఖుల వెనుక ఏదో ఒక దశలో ఒక గురువు మార్గదర్శకత్వం ఉంటుంది. అందుకే గురువు ఒక వ్యక్తిని మాత్రమే కాదు, ఒక తరాన్ని తీర్చిదిద్దగల శక్తి.

### కొవ్వొత్తిలా తాను కరిగి... ఇతరులకు వెలుగు

ఉపాధ్యాయ వృత్తి సాధారణ ఉద్యోగం కాదు. అది ఒక బాధ్యత. ఒక సామాజిక సేవ. ఒక భవిష్యత్ నిర్మాణ కార్యక్రమం. గురువు తన జ్ఞానాన్ని విద్యార్థులకు పంచుతూ తాను కొవ్వొత్తిలా కరిగిపోతాడు. విద్యార్థుల విజయాన్ని తన విజయంగా భావిస్తాడు. విద్యార్థి ఎదుగుదలలో తన పాత్రను చూసుకుంటాడు. హెచ్.జి. వెల్స్ అభిప్రాయంలో చరిత్రను నిర్మించే శక్తుల్లో ఉపాధ్యాయుడు అత్యంత ముఖ్యమైనవాడు. అందుకే దేశ భవిష్యత్తు తరగతి గదిలోనే నిర్మితమవుతుంది అని చెప్పడంలో అతిశయోక్తి లేదు.

### మారుతున్న గురు-శిష్య సంబంధం...

అయితే ప్రస్తుత పరిస్థితులను పరిశీలిస్తే గురుశిష్య సంబంధంలో అనేక మార్పులు కనిపిస్తున్నాయి. ఒకప్పుడు గురువు పట్ల విద్యార్థుల్లో గౌరవం, భక్తి, క్రమశిక్షణ ఉండేవి. నేడు కొన్ని సందర్భాల్లో ఉపాధ్యాయులను తక్కువగా చూడడం, వారి సూచనలను పట్టించుకోకపోవడం, ఎదురు మాట్లాడడం వంటి పరిణామాలు ఆందోళన కలిగిస్తున్నాయి. విద్యార్థుల్లో క్రమశిక్షణా రాహిత్యం, సెల్‌ఫోన్ వ్యసనం, చెడు స్నేహాలు, మాదక ద్రవ్యాల ప్రభావం, ఇతర అనైతిక అలవాట్లు వారి భవిష్యత్తును దెబ్బతీసే ప్రమాదం ఉంది. విద్యార్థిని సరిదిద్దేందుకు గురువు మందలించినా, కొన్ని సందర్భాల్లో దానిని తప్పుగా అర్థం చేసుకునే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. కొంతమంది విద్యార్థులు ఉపాధ్యాయులపై దాడులకు పాల్పడటం వంటి ఘటనలు మరింత ఆందోళనకరం.

విద్యార్థులను సన్మార్గంలో నడిపించే గురువుకే రక్షణ లేకపోతే, భవిష్యత్ తరాలను ఎవరు తీర్చిదిద్దాలి?ఉపాధ్యాయులపై దాడులు, అవమానాలు జరగకుండా ప్రభుత్వం, విద్యాశాఖ, తల్లిదండ్రులు, సమాజం సమిష్టిగా చర్యలు తీసుకోవాలి.అదే సమయంలో ఉపాధ్యాయులు కూడా తమ వృత్తిపరమైన ప్రమాణాలను, నైతిక బాధ్యతలను కాపాడుకోవాలి.

### తల్లిదండ్రుల పాత్ర కూడా కీలకమే...

విద్యార్థి జీవితాన్ని ప్రభావితం చేసే ప్రధాన శక్తుల్లో తల్లిదండ్రులు, గురువులు, స్నేహితులు, సమాజం ముఖ్యమైనవి. వీటిలో తల్లిదండ్రుల పాత్ర అత్యంత కీలకం. పిల్లలను ప్రేమించడం అవసరం. కానీ అతి గారాబం చేయడం మాత్రం ప్రమాదకరం. అడిగిన ప్రతిదీ కొనివ్వడం, చేతికి అవసరానికి మించిన డబ్బు ఇవ్వడం, పిల్లల చదువు గురించి అడగడంతో పాటు, వారు ఎవరితో స్నేహం చేస్తున్నారు? సమయాన్ని ఎలా వినియోగిస్తున్నారు? సెల్‌ఫోన్‌ను ఎంతవరకు ఉపయోగిస్తున్నారు? అనే విషయాలను కూడా తల్లిదండ్రులు గమనించాలి. ముఖ్యంగా గురువుల పట్ల గౌరవం, తల్లిదండ్రుల పట్ల బాధ్యత, పెద్దల పట్ల మర్యాద, సమాజం పట్ల బాధ్యత, దేశం పట్ల ప్రేమ వంటి నైతిక విలువలను చిన్నప్పటి నుంచే పిల్లలకు నేర్పాలి.

### విద్యలో నైతిక విలువలకు ప్రాధాన్యం అవసరం...

ప్రస్తుత విద్యావ్యవస్థలో విద్యార్థులకు బౌద్ధిక జ్ఞానంతో పాటు నైతిక విలువలు, సామాజిక బాధ్యత, మానవీయత, పర్యావరణ పరిరక్షణ, దేశభక్తి వంటి అంశాలకు కూడా తగిన ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉంది. ఎంతటి విద్యావంతుడైనా మానవత్వం లేకపోతే ఆ విద్యకు పరిపూర్ణత ఉండదు. మంచి మనిషిగా, మంచి పౌరుడిగా, సమాజానికి ఉపయోగపడే వ్యక్తిగా ఎదగడమే అసలు విజయం.

### గురువు... భవిష్యత్తుకు చుక్కాని...

సముద్రమనే జీవిత ప్రయాణంలో విద్యార్థి ఒక పడవ అయితే, ఆ పడవను సరైన దిశలో నడిపించే చుక్కాని గురువు. విద్యార్థులు ఎగిరే గాలిపటాలైతే, వారికి దిశానిర్దేశం చేసే దారం గురువు. సౌర కుటుంబంలో సూర్యుడు ఎలా కేంద్రంగా ఉంటాడో, పాఠశాలలో విద్యార్థుల అభ్యున్నతికి గురువు అంతే కీలకం. అందుకే గురువును కేవలం ఉద్యోగిగా కాకుండా భవిష్యత్ తరాల నిర్మాణకర్తగా సమాజం గుర్తించాలి.

### చివరి మాట...

ప్రాణాన్ని నిలబెట్టేవాడు వైద్యుడు అయితే, జీవితానికి దిశానిచ్చేవాడు గురువు. అజ్ఞానాన్ని తొలగించి జ్ఞానజ్యోతిని వెలిగించేవాడు ఉపాధ్యాయుడు. విద్యా వ్యవస్థలో నాణ్యత పెరగాలంటే ఉపాధ్యాయులు వృత్తిపరమైన నిబద్ధతతో పనిచేయాలి. విద్యార్థులు క్రమశిక్షణ, వినయం, గురుభక్తి, మానవీయ విలువలను అలవర్చుకోవాలి. తల్లిదండ్రులు పిల్లలకు ప్రేమతో పాటు బాధ్యతను నేర్పాలి. ప్రభుత్వం ఉపాధ్యాయులకు తగిన గౌరవం, భద్రత కల్పించాలి. సమాజం కూడా గురువును గురువుగానే గౌరవించాలి. "ఉపాధ్యాయుడు తనకు బోధించిన విద్యార్థి తనకంటే గొప్ప వ్యక్తిగా ఎదగాలని కోరుకుంటాడు." అదే గురువు మహోన్నతతనం. అజ్ఞానాంధకారాన్ని తొలగించి జ్ఞానదీపాన్ని వెలిగించే ప్రతి ఉపాధ్యాయుడికి ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు.

**రచన & సేకరణ: తప్పెట పీటర్ మహేశ్వర్**

ఆంగ్ల అధ్యాపకులు యద్మరాధమ్మ మెమోరియల్ (వై.ఆర్.ఎం.) డిగ్రీ కళాశాల, కల్వకుర్తి నాగర్‌కర్నూల్ జిల్లా, తెలంగాణ

# విద్యార్థుల చదువుకు బస్సుల కష్టాలు

**మర్రిగూడ నుంచి మాల్, ఇబ్రహీంపట్నం, హైదరాబాద్‌కు వెళ్లే విద్యార్థుల అష్టకష్టాలు**

**ఉదయం ప్రత్యేక బస్సు ఏర్పాటు చేయాలి మాజీ సర్పంచ్ నల్ల యాదయ్య.**



**మర్రిగూడ(క్రైమ్ మిర్రర్):** మర్రిగూడ నుండి పాఠశాలలకు కళాశాలలకు వెళ్లే విద్యార్థులకు ప్రతిరోజు, ఎదురవుతున్న రవాణా సమస్య తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. ఉదయం వేళ సరిపడా ఆర్టీసీ బస్సులు అందుబాటులో లేకపోవడంతో, విద్యార్థులు ప్రైవేట్ ఆటోలు, ఇతర ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. దీనితో సమయానికి పాఠశాలలు, కళాశాలలకు చేరుకోలేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని తెలంగాణ ఆర్టీసీ అధికారులు, వెంటనే స్పందించి ఉదయం ప్రత్యేక బస్సును ఏర్పాటు చేయాలని, మర్రిగూడ టౌన్ మాజీ సర్పంచ్ నల్ల యాదయ్య కోరారు. మర్రిగూడ మండలంలోని పలు గ్రామాలకు చెందిన విద్యార్థులు ప్రతిరోజూ మాల్, ఇబ్రహీంపట్నం, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని వివిధ పాఠశాలలు, ఇంజనీరింగ్ కళాశాలలకు విద్యాభ్యాసం కోసం వెళుతుంటారని, వీరిలో సుమారు 25 నుంచి 30 మంది వరకు విద్యార్థులు, ప్రతిరోజు మర్రిగూడ నుంచి ఉదయం 7 గంటల నుంచి 8 గంటల మధ్య బయలుదేరాల్సి ఉంటుందని, ఇదే సమయంలో బస్సుల కొరత ఉండటంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు. గుర్రంపూడ్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే బస్సు మాత్రమే, ఈ సమయంలో అందుబాటులో ఉండటంతో విద్యార్థులు దానిపైనే ఆధారపడాల్సి వస్తోందని, అయితే ఆ బస్సు నాంపల్లి నుంచే నిత్యం ప్రయాణికులతో కిక్కిరిసి వస్తుండటంతో, మర్రిగూడలో విద్యార్థులకు బస్సులో ప్రయాణించే అవకాశం దొరకడం కష్టంగా మారుతోందని, ఈ కారణంగా విద్యార్థులు వేలాడుతూ వెళ్లాల్సిన పరిస్థితి కనపడుతుందన్నారు.

**బస్సు కోసం ఎదురుచూపులు.. చివరకు ఆటోలే దిక్కు**

ఉదయం నిర్ణీత సమయానికి కళాశాలలు, పాఠశాలలకు చేరుకోవాల్సిన విద్యార్థులు, బస్సు కోసం ఎదురుచూస్తూ సమయం కోల్పోతున్నారు. బస్సు వచ్చినా రద్దీ కారణంగా ఎక్కలేని పరిస్థితులు ఏర్పడుతున్నాయని విద్యార్థులు వాపోతున్నారు. దీనితో తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేట్ ఆటోలను ఆశ్రయిస్తూ గమ్యాన్ని చేరుకోవాల్సిన పరిస్థితి. అయితే ఆటోల ద్వారా ప్రయాణించడం వల్ల, అదనపు ఆర్థిక భారం పడటమే కాకుండా, అన్ని సందర్భాల్లో సకాలంలో కళాశాలలు, పాఠశాలలకు చేరుకోలేకపోతున్నామని విద్యార్థులు చెబుతున్నారు. ఒక్కోసారి రవాణా సౌకర్యం సరిగా లేకపోవడంతో, తీవ్ర ఇబ్బందులు ఎదురై తిరిగి ఇంటికి వెళ్లాల్సిన పరిస్థితి కూడా ఏర్పడుతోందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**చదువుకు ఆటంకంగా మారుతున్న రవాణా సమస్య**

విద్యార్థుల దృష్టిలో సమయం ఎంతో విలువైనది, ప్రతిరోజూ తరగతులకు ఆలస్యంగా వెళ్లడం వల్ల, పాఠాలు కోల్పోవాల్సి వస్తోందని విద్యార్థులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా ఇంజనీరింగ్ వంటి ఉన్నత విద్యా కోర్సులు, చదువుతున్న విద్యార్థులకు ప్రతి క్లాస్ ఎంతో కీలకమైనదని, ఇలా తరచూ రవాణా సమస్యల కారణంగా తరగతులకు ఆలస్యమైతే చదువుపై ప్రతికూల ప్రభావం పడే, అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులు చదువుకోవడానికి దూర ప్రాంతాలకు వెళ్తున్నప్పటికీ కనీస రవాణా సౌకర్యం లేక ఇబ్బందులు పడాల్సి రావడం బాధాకరమని తల్లిదండ్రులు అంటున్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి ఉన్నత విద్య కోసం, పట్టణాలకు వెళ్లే విద్యార్థులకు రవాణా సౌకర్యం కల్పించడం, ఆర్టీసీ అధికారుల బాధ్యత అని స్థానికులు పేర్కొంటున్నారు. విద్యార్థుల సమస్యను దృష్టిలో ఉంచుకుని ఉదయం 7 నుంచి 8 గంటల మధ్య మర్రిగూడ నుంచి మాల్, ఇబ్రహీంపట్నం, హైదరాబాద్ వైపు విద్యార్థులకు అనుకూలంగా, ప్రత్యేకంగా బస్సు సర్వీసును ఏర్పాటు చేయాలని విద్యార్థులు కోరుతున్నారు. కనీసం విద్యార్థులు ఎక్కువగా ప్రయాణించే సమయాన్ని గుర్తించి, ఒక ప్రత్యేక ట్రిప్పును ఏర్పాటు చేస్తే ప్రతిరోజూ ఎదురవుతున్న ఇబ్బందులకు పరిష్కారం లభిస్తుందని చెబుతున్నారు. ఆర్టీసీ అధికారులు విద్యార్థుల సంఖ్యను పరిశీలించి, ఉదయం వేళ ప్రయాణ అవసరాలను అధ్యయనం చేసి, తక్షణమే అదనపు బస్సు లేదా ప్రత్యేక సర్వీసును అందుబాటులోకి తీసుకురావాలని విద్యార్థులు, తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు. విద్యార్థుల చదువుకు సంబంధించిన సమస్య కావడంతో అధికారులు దీనిని సాధారణ రవాణా సమస్యగా చూడకుండా, అత్యవసరంగా స్పందించాలని స్థానికులు కోరుతున్నారు. ప్రతిరోజూ 25 నుంచి 30 మంది విద్యార్థులు ఒకే సమయంలో ప్రయాణించాల్సి వస్తున్న నేపథ్యంలో, వారి అవసరాలకు అనుగుణంగా బస్సు సర్వీసును ఏర్పాటు చేయడం ద్వారా విద్యార్థులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని పేర్కొంటున్నారు. విద్యార్థులు సమయానికి తరగతులకు చేరుకునేలా ఉదయం వేళ ప్రత్యేక బస్సు ఏర్పాటు చేసి, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని తెలంగాణ ఆర్టీసీ ఉన్నతాధికారులను విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని మాజీ సర్పంచ్ నల్ల యాదయ్య డిమాండ్ చేస్తున్నారు.

# వైయస్సార్ 17వ వర్ధంతి వేడుకలు

**ప్రజల గుండెల్లో స్థిర స్థాయిగా నిలిచిపోయిన మాజీ ముఖ్యమంత్రి**



**వనపర్తి సెప్టెంబర్ 2 క్రైమ్ మిర్రర్:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర రెడ్డి గారి 17వ వర్ధంతి సందర్భంగా బుధవారం పెబ్బేరు కాంగ్రెస్ పార్టీ పట్టణ, మండల నాయకులు, అభిమానులు ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. సుభాష్ చౌరస్తాలో మున్సిపల్ వైస్ చైర్మన్ సుమిత్ర ఎల్లారెడ్డి. పట్టణ అధ్యక్షుడు కొంతం దయాకర్ రెడ్డి. మండల అధ్యక్షుడు రామ్ రెడ్డి. కౌన్సిలర్లు జమ్మలమ్మ తాటికొండ కృష్ణ భాగ్యలక్ష్మి శివ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు యూత్ కమిటీ సభ్యులు పెబ్బేరు పట్టణ ఎస్సీ సెల్ నాయకులు వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ సంక్షేమ పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు నింపిన మహోన్నత నేత వైఎస్సార్ అని నాయకులు కొనియాడారు. ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, 108 సర్వీసులు, ఫీజు రీయింబర్స్‌మెంట్, పక్కా ఇళ్ల నిర్మాణం వంటి చారిత్రాత్మక పథకాలు ఆయనను ప్రజల మనస్సుల్లో చిరస్థాయిగా నిలిపాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని మహానేతకు నివాళులర్పించారు



## ఓటర్ల జాబితా సవరణపై అవగాహన పెంచుకోవాలి


**60వ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన తహసీల్దార్ సతీష్‌కుమార్**

**రామకృష్ణాపూర్ సెప్టెంబర్ 2 (క్రైమ్ మిర్రర్):** ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో అర్హులైన ప్రతి ఒక్కరి పేరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని మందమర్రి తహసీల్దార్ పి. సతీష్‌కుమార్ తెలిపారు. క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 60వ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలకుడిగా సందర్శించి సవరణ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఓటర్ల జాబితాలోని తప్పులను సరిదిద్దడంతో పాటు ఆధార్ సహా ఇతర ధ్రువీకరణ పత్రాలను సేకరిస్తున్నట్లు తెలిపారు. 60వ పోలింగ్ కేంద్రంతో పాటు ఇతర కేంద్రాల పరిధిలోని బీఎల్‌వోలు, బీఎల్‌ఏలు, ప్రజాప్రతినిధులు ప్రజలకు అవగాహన కల్పించి సవరణ ప్రక్రియకు పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు.

**నోటీసులపై ఆందోళన వద్దు:**

ఓటర్ల సవరణలో భాగంగా అనామలస్ జాబితాలో పేర్లు రావడం, నోటీసులు అందడంపై ఓటర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఇంటిపేరు, వ్యక్తిగత పేరు మారడం, కుటుంబ సభ్యుల వివరాలు సక్రమంగా అనుసంధానం కాకపోవడం వంటి సాంకేతిక లోపాల కారణంగానే ఇలాంటి సమస్యలు తలెత్తుతాయని వివరించారు. వృద్ధులు, అనారోగ్యంతో కేంద్రాలకు రాలేని వారి ఇళ్లకు అధికారులు నేరుగా వెళ్లి వివరాలు సేకరిస్తున్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో 22వ వార్డు కౌన్సిలర్ మిట్టపల్లి సరిత శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీ పిసిసి అధ్యక్షుడు పిన్నింటి రఘునాథ్ రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు వోద్నాల శ్రీనివాస్, మాజీ పట్టణ అధ్యక్షుడు పల్లె రాజు, బీఎల్ వో లు, బీఎల్ఏలు పాల్గొన్నారు.

## సూర్యగిరి ఎల్లమ్మ ఆలయంలో వి.ఐ.పి లకే సకల మర్యాదలు -- - సామాన్య భక్తులు అవస్థలు...!



**మహేశ్వరం ప్రతినిధి (క్రైమ్ మిర్రర్):** రావిర్యాల సూర్యగిరి ఎల్లమ్మ బోనాల పండుగ సందర్భంగా ఆలయ యాజమాన్యం తీరుపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ నాయకులు, వి ఐ పి ల రాకతో ఆలయ అధికారులు వారి సేవల్లోనే నిమగ్నమయ్యారని, ఫలితంగా సామాన్య భక్తులను పట్టించుకోలేదని విమర్శలు వెల్లువెత్తాయి. ఆలయ ఈఓ వి ఐ పి సేవల్లోనే మునిగితేలారని భక్తులు ఆరోపించారు. ఎండలో గంటల తరబడి క్యూలైన్లలో వేచి ఉన్న సామాన్య భక్తులకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. తాగునీరు, నీడ వసతి లేకపోవడంతో మహిళలు, వృద్ధులు అవస్థలు పడ్డారు. క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నం లక్షకు పైగా భక్తులకు అన్ని వసతులు కల్పించామని ఆలయ ఈఓ చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉందని భక్తులు మండిపడ్డారు. వి ఐ పి లకు ఒక న్యాయం, సామాన్య భక్తులకు మరో న్యాయమా?" అని భక్తులు ప్రశ్నించారు. భక్తులకు సౌకర్యాలు కల్పించడంలో ఆలయ యాజమాన్యం నిర్లక్ష్యం వహించిందని ఆరోపించారు. బోనాల వంటి పెద్ద ఉత్సవంలో కనీస సౌకర్యాలు కూడా లేకపోవడంతో భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు.

# పండుగ వేళ సైబర్ మోసగాళ్లపై కన్నేయండి : ఎస్పీ సంకీర్త్

- సైబర్ నేరాలపై ప్రజలకు పోలీసుల అవగాహన
- బీ సైబర్ స్మార్ట్ అవగాహన పోస్టర్ల ఆవిష్కరణ
- సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలి: ఎస్పీ సంకీర్త్




**క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి:** వినాయక ఉత్సవాల సందర్భంగా ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించేందుకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో రూపొందించిన "బీ సైబర్ స్మార్ట్" అవగాహన పోస్టర్లను భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పండుగల సమయంలో సైబర్ నేరగాళ్లు వివిధ రకాల మోసాలకు పాల్పడే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గుర్తుతెలియని లింకులు, క్యూఆర్ కోడ్‌లు, ఫోన్ కాల్స్, మెసేజ్‌లను నమ్మవద్దని, వ్యక్తిగత వివరాలు, బ్యాంకింగ్ సమాచారం, ఓటీపీ లు, పాస్‌వర్డ్‌లు వంటి కీలక సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని హెచ్చరించారు. సైబర్ మోసానికి గురైన వెంటనే ఆలస్యం చేయకుండా 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించాలని ఎస్పీ సూచించారు. గణేష్ ఉత్సవాలను ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకోవడంతో పాటు సైబర్ భద్రతకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ నరేష్ కుమార్, సైబర్ సెక్యూరిటీ ఎస్సై శ్రీనివాస్, ఆర్ఎస్ఐ శివకుమార్, సైబర్ సెక్యూరిటీ వింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

# లియాఫీ ఆధ్వర్యంలో ఎల్ఐసి ఏజెంట్ల కుటుంబ సభ్యులకు ఉచిత వైద్య శిబిరం

**వనపర్తి ఎల్ఐసి బ్రాంచ్ మేనేజర్ చక్రవర్తి**




**వనపర్తి సెప్టెంబర్ 02 క్రైమ్ మిర్రర్:** లియాఫీ ఆధ్వర్యంలో ఎల్ఐసి ఏజెంట్ల కుటుంబ సభ్యులకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని వనపర్తి బ్రాంచ్ మేనేజర్ చక్రవర్తి అన్నారు. మంగళవారం,బుధవారం వనపర్తి ఎల్ఐసి బ్రాంచ్ లియాఫీ అధ్యక్షుడు కృష్ణ, కార్యదర్శి రాజశేఖర్,కోశాధికారి ప్రభాకర్ సౌజన్యంతో ఎల్ఐసి 70వ భీమా వారోత్సవాల సందర్భంగా యశోద హాస్పిటల్ (మలక్ పేట)సహకారంతో ఏర్పాటు చేసిన మెగా ఉచిత వైద్య శిబిరాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు.మారుతున్న జీవనశైలి వల్ల వస్తున్న అనారోగ్య సమస్యల పట్ల ఎల్ఐసి ఏజెంట్లు పడుతున్న కష్టాలు ఎనలేనివని వారు ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం వల్ల ఏజెంట్లకు ఆర్థిక భారం తగ్గుతుందని పేర్కొన్నారు. లియాఫీ యూనియన్ చేస్తున్న సామాజిక సేవను ఈ సందర్భంగా కొనియాడారు.ఈ శిబిరంలో దాదాపు 400 మందికి షుగర్, బీపీ, ఈసీజీ, 2డీ ఎకో మరియు థైరాయిడ్ పరీక్షలు, కంటి పరీక్షలు నిర్వహించి మందులు, కళ్లద్దాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులను శాలువా, పూల బొకేలతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఏబీఎం కృష్ణ ప్రసాద్,ఎల్ఐసి బ్రాంచ్ సిబ్బంది, లియాఫీ యూనియన్ నాయకులు, డెవలప్ మెంట్ ఆఫీసర్లు, యశోద ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# సుద్ధ మట్టితో రోడ్డు నిర్మాణమా- ఊరిపక్క నగేష్

**శివన్నగూడ--నామాపురం రోడ్డు నిర్మాణ నాణ్యతపై ఆరోపణలు**



**మర్రిగూడ(క్రైమ్ మిర్రర్):** ప్రజాధనంతో నిర్మిస్తున్న శివన్నగూడ నుంచి నామాపురం వరకు, తారు రోడ్డు పనులపై నాణ్యతా ప్రమాణాల విషయంలో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రోడ్డు నిర్మాణంలో భాగంగా తెల్లటి సుద్ధ మట్టిని పెద్ద మొత్తంలో వినియోగిస్తున్నారని, నిబంధనలకు అనుగుణంగా పనులు చేపట్టకపోతే రహదారి పటిష్టత దెబ్బతినే ప్రమాదం ఉందని, బిఆర్ఎస్ నాయకులు ఊరిపక్క నగేష్ ఆరోపించారు. రోడ్డు నిర్మాణ పనులను సంబంధిత అధికారులు వెంటనే పరిశీలించి, నాణ్యతా ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రస్తుతం శివన్నగూడ--నామాపురం మార్గంలో రోడ్డు నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. అయితే పనుల్లో భాగంగా రోడ్డుపై తెల్లటి సుద్ధ మట్టిని, పెద్ద మొత్తంలో వినియోగిస్తున్నారని నగేష్ పేర్కొన్నారు. రోడ్డు నిర్మాణంలో ఉపయోగించే మట్టి, ఇతర నిర్మాణ సామాగ్రి నాణ్యత విషయంలో నిర్దేశిత సాంకేతిక ప్రమాణాలు పాటించాల్సి ఉంటుందని, నాణ్యత లేని పదార్థాల వినియోగం వల్ల భవిష్యత్‌లో రోడ్డు దెబ్బతినే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

**ప్రభుత్వ నిబంధనల ప్రకారమే పనులు జరగాలి**


రోడ్డు నిర్మాణంలో నాణ్యతపై ప్రశ్నించినప్పుడు గుత్తేదారు నుంచి ప్రభుత్వం పర్మిషన్ ఇచ్చింది.. మేము ఇదే రోడ్డుకు, ఇదే మట్టి పోస్తాం.. ఏం చేస్తారో చేసుకోండి అంటూ, సమాధానం వచ్చిందని నగేష్ ఆరోపించారు.! అయితే కాంట్రాక్టర్ తన ఇష్టానుసారంగా కాకుండా ప్రభుత్వం నిర్దేశించిన అంచనాలు, సాంకేతిక ప్రమాణాలు, నాణ్యతా నిబంధనలకు అనుగుణంగానే పనులు చేపట్టాలని ఆయన స్పష్టం చేశారు. రోడ్డు నిర్మాణానికి వినియోగిస్తున్న మట్టి ఎక్కడి నుంచి తీసుకువస్తున్నారు? దానికి సంబంధిత రెవెన్యూ, మైన్స్ శాఖల అనుమతులు ఉన్నాయా? అన్న అంశాలను అధికారులు పరిశీలించాలని నగేష్ కోరారు. ముఖ్యంగా ప్రజాధనం ఖర్చు చేసి నిర్మిస్తున్న రహదారి కావడంతో, పనుల నాణ్యతపై అధికారులు నిరంతర పర్యవేక్షణ చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు.

**అధికారుల తనిఖీతోనే అసలు విషయం తేలాలి**

రోడ్డు నిర్మాణ పనులను సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఉపయోగిస్తున్న మట్టి, ఇతర నిర్మాణ సామగ్రికి నాణ్యతా పరీక్షలు నిర్వహించాలని నగేష్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ అంచనాలు, నిబంధనలు, సాంకేతిక ప్రమాణాల ప్రకారం పనులు జరుగుతున్నాయా, అన్నది అధికారులు స్పష్టం చేయాలని కోరారు. రోడ్డు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు ఉల్లంఘించినట్లు తేలితే, బాధ్యులైన కాంట్రాక్టర్‌పై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. రహదారి నిర్మాణం పూర్తయిన తర్వాత కొద్దికాలానికే గుంతలు ఏర్పడి, ప్రజలు మళ్లీ ఇబ్బందులు పడే పరిస్థితి రాకుండా ఇప్పుడే అధికారులు అప్రమత్తం కావాలని సూచించారు. ప్రజల డబ్బుతో నిర్మిస్తున్న రోడ్డు పనుల్లో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని, అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించి, ఉపయోగిస్తున్న మట్టి, నిర్మాణ సామగ్రిని పరీక్షించాలన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నాణ్యమైన, దీర్ఘకాలం మన్నే రహదారి నిర్మాణం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఊరిపక్క నగేష్ కోరారు. రోడ్డు నిర్మాణంపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో సంబంధిత అధికారులు వెంటనే స్పందించి, వాస్తవాలను పరిశీలించాలని స్థానికులు కూడా కోరుతున్నారు

# జూటా పాలనకు కేరాఫ్ రేవంత్ సర్కారు: జీఎంఆర్

- 420 హామీల అమలులో కాంగ్రెస్ వైఫల్యం
- 22ఏ భూముల సమస్యపై అసెంబ్లీలో పోరాడతాం
- ఎమ్మెల్యే ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- కాంగ్రెస్ పార్టీ 420 మోసాలపై పోరుబాట: ఆదర్శ్ రెడ్డితో



**లిపటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి సెప్టెంబర్ 02:** ఎన్నికల సమయంలో 420 హామీల పేరుతో ప్రజలకు అరచేతిలో స్వర్గం చూపించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో ఘోరంగా విఫలమైందని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ బీఆర్ఎస్ పార్టీ అధిష్ఠానం పిలుపు మేరకు చేపట్టిన "కాంగ్రెస్ పార్టీ 420 మోసాలపై పోరుబాట" కార్యక్రమంలో భాగంగా బుధవారం పటాన్‌చెరులో నిరసన ర్యాలీ నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ పటాన్‌చెరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదర్శ్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి గాంధీ పార్క్ నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీలో పాల్గొన్నారు. 420 హామీలను ప్రస్తావిస్తూ ఫ్లెక్సీలను ప్రదర్శించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించి కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై నిరసన తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాల కింద లబ్ధిదారులకు చెల్లించాల్సిన బకాయిల వివరాలను తెలియజేస్తూ బీఆర్ఎస్ నాయకులు "బాకీ కార్డులు" పంపిణీ చేశారు. పెండింగ్‌లో ఉన్న సంక్షేమ బకాయిలను వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 2 నుంచి 7 వరకు చేపట్టనున్న పోరుబాటలో భాగంగా నియోజకవర్గంలోని ప్రతి గ్రామం, వార్డు, డివిజన్‌లో ప్రజా సమస్యలను ప్రస్తావిస్తూ కార్యక్రమాలు నిర్వహిస్తామని నాయకులు తెలిపారు. 22ఏ నిషేధిత జాబితాలో వివాదాలు లేని భూములను చేర్చడంతో ప్రజలు తమ ఆస్తులను అమ్ముకోలేని, కొనలేని పరిస్థితి ఏర్పడుతోందని ఎమ్మెల్యే ఆరోపించారు. 22ఏ భూముల సమస్యను అసెంబ్లీలో ప్రధాన అంశంగా లేవనెత్తి బాధితులకు న్యాయం జరిగే వరకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం అమలు చేసిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, కేసీఆర్ కిట్ తదితర సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని జీఎంఆర్ ఆరోపించారు. రైతులు, విద్యార్థులు, మహిళలు, పేదలు, సామాన్య ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. "100 రోజులన్నారు.. 1000 రోజులు అయ్యాయి" అని విమర్శిస్తూ.. హామీలను అమలు చేసే వరకు బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# నిరుపేద జీవితాల్లో వెలుగులు నింపిన నాయకుడు వైయస్సార్

### మునుగోడులో ఘనంగా వైఎస్సార్ వర్ధంతి

### కాంగ్రెస్ నేతల ఘన నివాళి

**మునుగోడు( క్రైమ్ మిర్రర్) :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, డాక్టర్ వై.ఎస్. రాజశేఖర రెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని మునుగోడు మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వైఎస్సార్ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి అంజలి ఘటించారు.ఈ సందర్భంగా చండూరు మార్కెట్ కమిటీ చైర్మన్ ధోటీ నారాయణ మాట్లాడుతూ.వైఎస్సార్ ప్రవేశపెట్టిన ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్మెంట్, జలయజ్ఞం, మరియు పక్కా ఇళ్ల పథకాలు నేటికీ నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని నాయకులు కొనియాడారు.ఏ సంక్షేమ పథకం తలపెట్టినా అది పేదవాడి ముంగిటకే చేరాలనే ఆశయంతో పాలన సాగించిన ప్రజా నాయకుడు వైఎస్సార్ అని కొనియాడారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులు రెండు నిమిషాలు మౌనం పాటించి ఆయన ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బీమనపల్లి సైదులు,సర్పంచులు కదిరే లింగస్వామి,ఏర్పుల మోహన్ బాబు, కంభంపాటి జ్యోతి ,నాయకులు ముచ్చపోతుల నరసింహ,పొలగొని ప్రకాష్,,జక్కల శ్రీను,ముచ్చపోతుల శ్రీనివాస్, పెరుమాళ్ల రామలింగయ్య,అనంత స్వామి గౌడ్,పందుల అశోక్, జాజుల స్వామి గౌడ్,రవీందర్ రెడ్డి,కట్ట రాజు, జిట్టగోనీ సైదులు కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు,మండల పార్టీ అధ్యక్షులు,వివిధ విభాగాల నాయకులు, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్యుఐ నాయకులు మరియు భారీ సంఖ్యలో వైఎస్సార్ అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మోడిఫైడ్ సైలెన్సర్లపై పోలీసుల కొరడా

### ఆరు బైక్‌లు స్వాధీనం.. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు: ఎస్ఐ నరేష్



**మందమర్రి, సెప్టెంబరు 2(క్రైమ్ మిర్రర్):** మోడిఫైడ్ సైలెన్సర్లతో అధిక శబ్దాలు చేస్తూ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న ద్విచక్ర వాహనాలపై మందమర్రి పోలీసులు కొరడా ఝళిపించారు. పట్టణ పరిధిలో నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో నిబంధనలకు విరుద్ధంగా శబ్దాలు చేస్తూ ప్రయాణిస్తున్న ఆరు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు.వాహనాలకు అమర్చిన మోడిఫైడ్ సైలెన్సర్లను తొలగించి, సంబంధిత వాహనదారులకు, యువతకు కౌన్సెలింగ్ నిర్వహించారు. అధిక శబ్దాలతో వాహనాలు నడపడం వల్ల వృద్ధులు, చిన్నారులు, రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎస్ఐ నరేష్ తెలిపారు.మోడిఫైడ్ సైలెన్సర్లతో వాహనాలు నడపడం నిబంధనలకు విరుద్ధమని ఆయన హెచ్చరించారు. ఇకపై ఇలాంటి ఉల్లంఘనలకు పాల్పడితే వాహనాలను స్వాధీనం చేసుకోవడంతో పాటు జరిమానాలు, చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పట్టణంలో మోడిఫైడ్ సైలెన్సర్ బైక్‌లపై ప్రత్యేక తనిఖీలు, నిఘా కొనసాగుతాయని ఎస్ఐ నరేష్ పేర్కొన్నారు.

# నకిరేకల్ సీఎం సభను అడ్డుకుంటాం

### ఎన్నికల హామీలో నియోజకవర్గానికి ఇచ్చిన హామీలు అమలు చేయాలి

### ప్రభుత్వం నుంచి జీవోలు నిధులు విడుదలైన తర్వాతే సీఎం రేవంత్ రెడ్డి నియోజకవర్గానికి రావాలి

### పల్లగొర్ల మోదీరాందేవ్



**నార్కెట్ పల్లి, క్రైమ్ మిర్రర్ :-** ఈ నెల 05 తారీఖున నకిరేకల్ మెడికల్ కాలేజ్ ఓపెనింగ్ కాంగ్రెస్ పార్టీ నిర్వహించే బహిరంగ సభకు సీఎం రేవంత్ రెడ్డి, నియోజకవర్గానికి ఇచ్చిన హామీలు అమలు చేసిన తర్వాతనే రావాలని నార్కెట్పల్లిలో నిర్వహించిన సమావేశంలో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ పల్లగొర్ల మోదీరాందేవ్ అన్నారు. వారు మాట్లాడుతూ నకిరేకల్ నియోజకవర్గంలో ఎక్కడి సమస్యలు అక్కడనే ఉన్నాయి, ఎన్నికల ప్రచారంలో చెప్పిన హామీలు అమలు చేసిన తర్వాతే ఈ నియోజకవర్గానికి రావాలి నియోజకవర్గానికి ప్రత్యేక నిధులు కేటాయిస్తామన్నారు ప్రభుత్వ నుంచి జీవోతో పాటు నిధులు ఇచ్చిన తర్వాతే సీఎం నియోజకవర్గంలో అడుగు పెట్టాలి,కొడంగల్ నియోజకవర్గాన్ని ఏ విధంగా అభివృద్ధి చేస్తున్నారో నకిరేకల్ నియోజకవర్గాని కూడా అదే విధంగా అభివృద్ధి చేయాలి అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న ఈ నియోజకవర్గం అభివృద్ధి చేస్తాం మా అభ్యర్థిని గెలిపియమని చెప్పి గెలిచిన తర్వాత అభివృద్ధికి నోచుకోని నకిరేకల్ నియోజకవర్గం, ఆనాడు ప్రత్యేక నిధులు కేటాయిస్తామని చెప్పారు, ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఫార్మసీ కాలేజ్,ఇంజనీరింగ్ కాలేజ్ మంజూరు చేస్తామన్నారు ఎస్ఎల్ బీసీ తో పాటు ధర్మారెడ్డి పిల్లాయిపల్లి ప్రాజెక్టు పనులు పూర్తి చేస్తామన్నారు రామన్నపేట కు మెడికల్ కాలేజ్ మంజూరు గురుకుల పాఠశాలలో మంజూరు చేస్తామన్నారు గోదావరి కృష్ణ నీళ్లతో నియోజకవర్గంని సశ్యామలం చేస్తామన్నారు అమ్మనబోలు ఎలిమినేడు మండలాలు చేస్తామన్నారు నియోజకవర్గంలో ఉన్న ఏడు మండల టౌన్లకు 100 కోట్లతో అభివృద్ధి చేస్తామన్నారు ఎస్సీ కాంసెన్సీ కాబట్టి ప్రత్యేక నిధులు కేటాయించి గ్రామాలను అభివృద్ధి చేస్తామన్నారు, మీరు ఎన్నికల వాగ్దానంలో ఇచ్చిన 6 గ్యారంటీలు అమలు చేయాలి విద్యార్థులకు రావాల్సినటువంటి పదివేల కోట్ల ఫీజు బకాయిలు విడుదల చేయాలి రాష్ట్రంలో ఖాళీగా ఉన్న రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాలి . ఎస్సీ ఎస్టీ బిసి మైనార్టీ అగ్రవర్ణ పేదలంతా ఏకతాటి మీద ఉండి ఈ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి అన్నారు. నియోజకవర్గానికి ఇచ్చిన అన్ని హామీల జీవోలతో పాటు నిధులు విడుదల చేసిన తర్వాతే సీఎం సభ నిర్వహించాలి లేకపోతే ఎక్కడ అక్కడ గ్రామ గ్రామాన అడ్డుకుంటాం ప్రభుత్వ నాయకులను తరిమికొడతామని హెచ్చరించారు.ఈ సమావేశంలో బీసీ యువజన సంఘం ఉమ్మడి జిల్లా కన్వీనర్ ఎడ్ల మహాలింగం, వెంకటేశ్వరరావు, మనీల్, సురేష్, సంతోష, భాస్కర్, మణికంఠ, తదితరులు పాల్గొన్నారు

# ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

### నకిలీ వెబ్ సైట్లు ఓపెన్ చేయకండి

### పెబ్బేరు ఎస్ఐ వెంకటేశ్వర్ గౌడ్



**వనపర్తి సెప్టెంబర్ 2 క్రైమ్ మిర్రర్:** సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పి సునీత రెడ్డి ఆదేశాల మేరకు పెబ్బేర్ ఎస్ఐ వెంకటేశ్వర గౌడ్ .బుధవారం సైబర్ జాగృత దివస్ సందర్భంగా పెబ్బేరు మహాత్మా గాంధీ జ్యోతిరావు పూలే స్కూల్లో విద్యార్థులకు సైబర్ క్రైమ్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ వెంకటేశ్వర్లు గౌడ్ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో సైబర్ నేరాలు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు ఆన్‌లైన్ లావాదేవీల విషయంలో మరింత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా డిజిటల్ చెల్లింపులు, డిజిటల్ భద్రత, ఆన్‌లైన్ షాపింగ్ మోసాలు, పెట్టుబడి మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. డిజిటల్ చెల్లింపుల విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రజలు ఓటిపి యూపీఐ పిన్, ఏటీఎం పిన్, సి వి వి, పాస్‌వర్డ్ వంటి రహస్య వివరాలను ఇతరులతో పంచుకోవద్దని తెలిపారు. బ్యాంకు అధికారులు, పోలీసుల పేరుతో ఫోన్ చేసి వ్యక్తిగత లేదా బ్యాంకింగ్ వివరాలు అడిగినా వాటిని వెల్లడించవద్దని ఆయన తెలిపారు. గుర్తుతెలియని లింకులను క్లిక్ చేయడం, అనుమానాస్పద యాప్‌లను డౌన్‌లోడ్ చేయడం చేయవద్దని హెచ్చరించారు. ఆన్‌లైన్ షాపింగ్ మోసాలపై మాట్లాడుతూ తక్కువ ధరలకు వస్తువులు అందిస్తామని చెప్పే నకిలీ వెబ్‌సైట్లు, సోషల్ మీడియా ప్రకటనలను నమ్మవద్దని సూచించారు. నకిలీ కస్టమర్ కేర్ నంబర్లు, రీఫండ్ లింకులు, ఫేక్ ఆఫర్ల ద్వారా మోసాలు జరిగే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. పెట్టుబడి మోసాలపై మాట్లాడుతూ తక్కువ సమయంలో అధిక లాభాలు వస్తాయని చెప్పే ఆన్‌లైన్ పెట్టుబడి పథకాలను నమ్మవద్దని అన్నారు. వాట్సాప్, టెలిగ్రామ్ తదితర సామాజిక మాధ్యమాల ద్వారా వచ్చే అనుమానాస్పద పెట్టుబడి ఆఫర్లను పరిశీలించకుండా డబ్బులు పెట్టుబడి పెట్టవద్దని సూచించారు. నకిలీ ట్రేడింగ్ యాప్‌లు, వెబ్‌సైట్ల పట్ల జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. ఎవరైనా సైబర్ నేరానికి గురైతే వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని ఎస్ఐ సూచించారు. మోసం జరిగిన వెంటనే స్పందించడం ద్వారా నష్టాన్ని తగ్గించే అవకాశం ఉంటుందని తెలిపారు. అలాగే గణేష్ మండపాల నిర్వాహకులు సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించే పోస్టర్లను మండపాల వద్ద ప్రదర్శించాలని సూచించారు. డిజిటల్ చెల్లింపులు, ఆన్‌లైన్ షాపింగ్ మోసాలు, పెట్టుబడి మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎవరైనా మోసాలకు పాల్పడితే వెంటనే 100 కు డయల్ చేసి సమాచారం తెలుపగలరని ఎస్పై తెలిపారు ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయునిలు. పోలీసులు. విద్యార్థులు పాల్గొన్నారు



# భక్తిశ్రద్ధలతో గెల్వలాంబ మాత బ్రహ్మోత్సవాలు

**అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తజనం**

**ప్రత్యేక పూజలు నిర్వహించిన ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి**

**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి (వంగూరు):** వంగూరు మండల కేంద్రంలో శ్రీ గెల్వలాంబ మాత బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. దీంతో ఆలయ పరిసరాలు భక్తుల సందడితో ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి బుధవారం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, నిర్వాహకులు ఆయనకు ఘన స్వాగతం పలికి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ.. శ్రీ గెల్వలాంబ మాత కృపాకటాక్షాలు వంగూరు ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం వెల్లివిరియాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. భక్తిశ్రద్ధలతో బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్న ఆలయ కమిటీ సభ్యులకు తనను ఆహ్వానించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు కొనసాగుతుండటంతో వంగూరుతో పాటు పరిసర గ్రామాల నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ నకినమోని శేఖర్, వైస్ చైర్మన్ మురళీ, కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్ గౌడ్, సీనియర్ నాయకులు మల్లేష్, సుమన్, చక్రవర్తి, సురేష్, రమేష్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ లో నకిలీ కరెన్సీ ముఠా పట్టివేత - రూ.2,91,100 స్వాధీనం

**హైదరాబాద్,క్రైమ్ మిర్రర్:-** నకిలీ భారతీయ కరెన్సీ నోట్లను ముద్రించి చలామణి చేస్తున్న ముఠా గుట్టును హైదరాబాద్ పోలీసులు రట్టు చేశారు. కమిషనర్ టాస్క్ ఫోర్స్ షంషాబాద్ జోన్ టీమ్ మరియు బాలాపూర్ పోలీసులు సంయుక్తంగా దాడి చేసి ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. వారి నుండి రూ. 2,91,100 విలువైన నకిలీ నోట్లను, ప్రింటింగ్ పరికరాలను స్వాధీనం చేసుకున్నారు.



**పట్టుబడిన నిందితులు:**

రామావత్ రాము అలియాస్ మహమ్మద్ (36) - జొమాటో డెలివరీ బాయ్, చింతల్ తండా, వడ్డిపట్ల రామావత్ మోతీలాల్ (35) - ర్యాపిడో డ్రైవర్, చింతల్ తండా , రామావత్ గాంధీ (19) - ఆటో డ్రైవర్, చింతల్ తండా పరారీలో ఉన్న మరో నిందితుడు సుధీర్ జాన్ చెలా అలియాస్ వంశీ, నాగోల్ కోసం పోలీసులు గాలిస్తున్నారు.

**స్వాధీనం చేసుకున్న సొత్తు:**

నకిలీ 500 నోట్లు - 437, 100 నోట్లు - 648, 200 నోట్లు - 39, మొత్తం రూ.2,91,100. వీటితో పాటు జిరాక్స్ కోసం వాడుతున్న అసలు 500, 100 నోట్లు, చిల్డ్రన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నోట్ల కట్టలు, ఇప్సన్ కలర్ ప్రింటర్, స్కానర్, లామినేటర్, పేపర్ కటర్, రంగులు, వాటర్ మార్క్ పేపర్లు, 3 స్మార్ట్ ఫోన్లు, బైక్ (టీజీ 07 బిఈ 9434) స్వాధీనం చేసుకున్నారు.

**ఎలా తయారు చేశారు?**

ప్రధాన నిందితుడు రామావత్ రాము కుటుంబ కలహాలతో ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నాడు. డబ్బు కోసం బంధువు మోతీలాల్ తో కలిసి యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్ వీడియోలు చూసి నకిలీ నోట్లు తయారీ నేర్చుకున్నారు. యూట్యూబ్ లో కనిపించిన ఫోన్ నంబర్ కు కాల్ చేసి విధానం తెలుసుకుని ప్రింటర్, బాండ్ పేపర్లు కొనుగోలు చేసి నోట్లను తయారు చేశారు. వాటిని రాత్రి సమయంలో వైన్ షాపులు, కూరగాయల మార్కెట్లలో చిన్న మొత్తాల్లో చలామణి చేస్తున్నారు. విశ్వసనీయ సమాచారంతో దాడి చేసి నిందితులను పట్టుకున్నట్లు అడిషనల్ డీసీపీ కె.ఎస్.రావు తెలిపారు. ఈ ఆపరేషన్ లో ఇన్స్పెక్టర్ డి. కృష్ణమోహన్, బాలాపూర్ ఇన్స్పెక్టర్ సుధాకర్, ఎస్ఐ మన్సూర్ అలీ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# వైఎస్సార్ సేవలు చిరస్మరణీయం

**ప్రజా సంక్షేమ పాలనకు ఆయన ఆదర్శం**

**కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పిన్నింటి రఘునాథ్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు వొడ్నాల శ్రీనివాస్**

**రామకృష్ణాపూర్, సెప్టెంబరు 2 (క్రైమ్ మిర్రర్):** దివంగత ముఖ్యమంత్రి, మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి భౌతికంగా మన మధ్య లేకపోయినా ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పిన్నింటి రఘునాథ్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు వొడ్నాల శ్రీనివాస్ అన్నారు. వైఎస్సార్ వర్ధంతిని పురస్కరించుకుని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులకు ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఇందిరమ్మ ఇళ్ల వంటి సంక్షేమ పథకాలతో పేదలు, రైతులు, విద్యార్థులు, మహిళలు, కార్మికుల జీవితాల్లో వైఎస్సార్ వెలుగులు నింపారని పేర్కొన్నారు. అధికారం ప్రజలకు సేవ చేయడానికేనని తన పాలనతో నిరూపించిన నాయకుడని కొనియాడారు.వైఎస్సార్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తోందన్నారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్,



సన్నబియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇళ్లతో పాటు విద్యార్థులు, యువతకు పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. వైఎస్సార్ ఆశయాలను ఆచరణలో పెట్టి ప్రజల పక్షాన నిలబడటమే ఆయనకు నిజమైన నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ పట్టణ అధ్యక్షుడు పల్లె రాజు, కౌన్సిలర్లు దాముక శిరీష, భీమ మల్లేష్, కూతురు ప్రభాకర్, గుర్రం శ్రీనివాస్, నాయకులు కాసర్ల ప్రకాష్, పనాస రాజు, గోపు రాజం, ఏల్పుల సత్యనారాయణ, మేకల సురేందర్, ఎర్రబెల్లి రాజేష్, పైడాకుల శ్రీనివాస్, కూనారపు శివ, బొద్దుల ప్రేమ్‌సాగర్, నక్క శ్రీనివాస్, దాముక రమేష్, ఆలేటి వెంకటేష్, బోనగిరి రవీందర్, బత్తిని రవి, మహిళా నాయకులు దీప, అనూష, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

# నిజమైన అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి



**ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో ఏకపక్ష నిర్ణయాలు సహించం**

**జాన్ పహాడ్ దర్గా గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ రాజు రాథోడ్**

**క్రైమ్ మిర్రర్, పాలకీడు:** నిజమైన అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో ఏకపక్ష నిర్ణయాలు సహించం అని జాన్ పహాడ్ దర్గా గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ రాజు రాథోడ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాన్‌పహాడ్ దర్గా గ్రామపంచాయతీ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక విషయంలో పాలకవర్గ సభ్యులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా, వారి అభిప్రాయాలు తీసుకోకుండా ఏకపక్షంగా పేర్లు ప్రకటించడం తీవ్ర అభ్యంతరకరమైన విషయం అని, గ్రామపంచాయతీ అనేది ఒక్క వ్యక్తి ఇష్టానుసారంగా నడిచే వ్యవస్థ కాదనీ ,ప్రజలచే ఎన్నుకోబడిన ఉపసర్పంచ్, వార్డు సభ్యులు , పాలకవర్గం అందరి భాగస్వామ్యంతో నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. నిజమైన పేదలకు, అర్హులైన నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు అందేలా పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక జరగాలని అన్నారు. పాలకవర్గానికి తెలియకుండా, గ్రామ ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా పేర్లను ప్రకటించడం వెనుక ఉన్న విధానంపై స్పష్టత ఇవ్వాలి. నిజంగా అర్హులైన పేద కుటుంబాలకు న్యాయం జరగాలి తప్ప, కొందరి ఏకపక్ష నిర్ణయాలతో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు కావడం సరైన పద్ధతి కాదు. ఇందిరమ్మ ఇళ్లు ఎవరి వ్యక్తిగత ఆస్తి కాదు,అవి పేద ప్రజల హక్కు అని అన్నారు. జాన్ పహాడ్ దర్గా గ్రామపంచాయతీ 15 ఇందిరమ్మ ఇళ్లలో 11 మంది లబ్ధిదారులు దర్గా వారు ఉండడం ఆశ్చర్యకరమైన విషయం అని, కావున లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా నిర్వహించి, పాలకవర్గ సభ్యులందరికీ సమాచారం అందించి, గ్రామసభలో చర్చించి, నిజమైన అర్హులైన పేదలకు మాత్రమే ఇళ్లు కేటాయించాలని సంబంధిత అధికారులను కోరుతున్నామన్నారు. ప్రజాస్వామ్యాన్ని పక్కన పెట్టి ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటే వాటిని ప్రజల ముందు ప్రశ్నిస్తాం. పేదలకు అన్యాయం జరిగితే న్యాయం కోసం అవసరమైన అన్ని ప్రజాస్వామ్య మార్గాల్లో పోరాటం చేస్తాం అని జాన్ పహాడ్ దర్గా ఉపసర్పంచ్ రాజు రాథోడ్ డిమాండ్ చేశారు.

# మునుగోడులో 1000 రోజుల పాలనపై హోరెత్తిన బిఆర్ఎస్ నిరసన ధర్నా



ఇచ్చిన హామీలు నెరవేర్చమని అడిగితే ప్రతిపక్షాలపై దాడులు చేయడం, అరెస్టులు చేయడమే ఈ ప్రభుత్వ పనిగా మారింది. మహిళలు, రైతులు, యువత అంతా ఈ మోసపూరిత పాలనతో విసిగిపోయారు. 1000 రోజుల పాలనలోనే కాంగ్రెస్ రంగు బయటపడింది. రాబోయే రోజుల్లో ప్రజలే ఈ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతారు అని గుర్తుకు తెచ్చారు.మండల అధ్యక్షుడు మందుల సత్యం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పాల్వాయి స్రవంతి రెడ్డి, మునగాల నారాయణరావు, కర్నాటి వెంకటేశం,పల్లె కళ్యాణి, వివిధ మండలాల అధ్యక్షులు, సర్పంచ్‌లు, ఎంపిటీసీలు, ప్రజాప్రతినిధులు మరియు బారీ సంఖ్యలో కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్న ఇందిరమ్మ ఇళ్లు

**చంద్రధనలో ఇళ్ల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**

**ప్రభుత్వ పాఠశాలను సందర్శించి సమస్యలు తెలుసుకున్న ఎమ్మెల్యే**

**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి (తలకొండపల్లి):** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం చంద్రధన గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి హాజరై ఇళ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇల్లు లేని పేద కుటుంబాలకు సొంతింటిని అందించాలనే లక్ష్యంతో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. ఏళ్ల తరబడి సొంతింటి కోసం ఎదురుచూస్తున్న కుటుంబాలకు ఇందిరమ్మ ఇల్లు కేవలం పథకం మాత్రమే కాకుండా భరోసా, నమ్మకాన్ని కల్పించే కార్యక్రమమని పేర్కొన్నారు. "వానొచ్చినా.. ఎండొచ్చినా.. మనకంటూ ఒక ఇల్లు ఉందనే ధైర్యాన్ని ఇందిరమ్మ ఇళ్లు కల్పిస్తాయి. తల్లిదండ్రుల కష్టానికి ఓ చిరునామాగా, పిల్లల భవిష్యత్తుకు ఓ పునాదిగా, పేద కుటుంబాల ఆత్మగౌరవానికి ప్రతీకగా సొంత ఇల్లు నిలుస్తుంది" అని ఎమ్మెల్యే అన్నారు. ఒక ఇల్లు నిర్మించడం మాత్రమే కాకుండా ఒక కుటుంబం కలను నిజం చేస్తున్నామనే తృప్తి ప్రజా ప్రభుత్వానికి ఉందని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను సందర్శించి విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సొల్లు రంగమ్మ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యట నరసింహ, మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు డోకురి ప్రభాకర్ రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి డి. రఘురాములు, డీసీసీ కార్యదర్శి భగవాన్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు వెంకట్ రెడ్డి, అజీమ్, మాజీ సర్పంచులు పి. రమేష్ యాదవ్, జైపాల్ రెడ్డి, గ్రామ నాయకులు మాజీ ఎంపీటీసీ రాములు, రాజేందర్ రెడ్డి, చిత్తరంజన్, రాఘవేందర్, బండల శంకర్ రెడ్డి, శివాజీ, వార్డు నెంబర్ కిట్టు, అయ్యన్న, మహేష్, ఆదర్శ్, బి. యాదగిరి, సిమ్మారెడ్డి, కృష్ణయ్య, సాకలి యాదగిరి, షర్ఫ్, దాసరి యాదయ్య, సాకలి అంజయ్య, జంగయ్య, అంజయ్య గౌడ్, పి. అశోక్ బాబు, బి. నర్సింలు, అజీజ్, జుట్టు తిరుపతయ్య ముదిరాజ్, అరిఫ్, రాజేందర్ నాయక్, విష్ణు, పవన్ వాల్మీకి తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ వైఫల్యాలపై ఆమనగల్లులో బీఆర్ఎస్ సమరభేరి

**1000 రోజుల పాలనలో హామీల అమలు ఏదీ...? -- ప్రభుత్వాన్ని నిలదీసిన బీఆర్ఎస్**

**'కాంగ్రెస్ బాకీ కార్డు'తో భారీ ర్యాలీ.. ప్రజల్లోకి వైఫల్యాలను తీసుకెళ్తామన్న నేతలు**





**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి (ఆమనగల్లు):** కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనలో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఆమనగల్లులో నిరసన గళం వినిపించింది. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యంగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో హైదరాబాద్--శ్రీశైలం జాతీయ రహదారిపై భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. 'కాంగ్రెస్ బాకీ కార్డు' పేరిట చేపట్టిన ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ర్యాలీ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నాయకులు, కార్యకర్తలు తమ నిరసన వ్యక్తం చేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో కాంగ్రెస్ పాలనపై బీఆర్ఎస్ నాయకులు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.

## హామీల అమలుపై ప్రశ్నలు....

ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. 1000 రోజుల పాలన పూర్తయినా ప్రజలకు ఇచ్చిన హామీల అమలు విషయంలో స్పష్టత లేదని విమర్శించారు. రాష్ట్రంలోని వివిధ రంగాల్లో ప్రభుత్వం ఆశించిన స్థాయిలో పనిచేయలేకపోయిందని పేర్కొన్నారు. ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని, కాంగ్రెస్ నాయకులు ప్రజల్లోకి వెళ్లి తమ పాలనను సమర్థించుకునే పరిస్థితి లేదని బీఆర్ఎస్ నేతలు వ్యాఖ్యానించారు.

## రాజకీయంగా బీఆర్ఎస్ కార్యాచరణకు నాంది...

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ చేపట్టిన ఈ నిరసన కార్యక్రమం రాబోయే రోజుల్లో పార్టీ ఉద్యమ కార్యాచరణకు నాందిగా నిలుస్తుందని నాయకులు స్పష్టం చేశారు. కేవలం విమర్శలకే పరిమితం కాకుండా ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రంలో మరోసారి బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలీ శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర గిడ్డంగుల మాజీ చైర్మన్ రజని, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్, పీఏసీఎస్ చైర్మన్ గంప వెంకటేష్ సర్పంచ్ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు లక్ష్మీ నరసింహారెడ్డి కర్తాల్ మాజీ జెడ్పిటిసి జర్పుల దశరథ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు